క్లుప్తంగా

కన్వీనర్లు, గృహసారథుల పాత్ర కీలకం



యాగంటిపల్లెలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: రానున్న ఎన్నికల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇల్లూరు కొత్తపేట, యాగంటిపల్లె, తమ్మడపల్లె గ్రామాల్లో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఓబులరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ సచివాయాల కన్వీనర్లు, గృహసారథులు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుండం నాగేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు రమణ, వెంకట్రామిరెడ్డి, బండి వరలక్ష్మీ, ఎంపీటీసీ మారం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా

బేతంచెర్ల: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది క్యాలెండర్‌ను వీహెచ్‌పీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బుగ్గన చంద్ర మౌళీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బేతంచెర్లలోని ఆయన స్వగృహంలో విడుదల చేశారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వీహెచ్‌పీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, ధరణి, శ్రీను పాల్గొన్నారు.

నేడు పార్కు ప్రారంభోత్సవం



రూపుదిద్దుకున్న నెహ్రూనగర్ మునిసిపల్ పార్కు

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు నెహ్రూ నగర్‌లోని మంత్రి స్వగృహం ఎదుట రూ.30 లక్షలతో నిర్మించిన నూతన పార్కును ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు మండలంలోని వెంకటాపురం చెరువు వద్ద రూ.3 కోట్లతో చేపట్టనున్న బోటింగ్, టూరిజం పనులకు భూమిపూజ చేస్తారు. 10.30 గంటలకు సాయి శ్రీ ఫంక్షన్‌హాల్‌లో పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు.

జైలుశిక్ష ఖరారు

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని తిమ్మాపురానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీకి అత్యాచారయత్నం కేసులో మూడున్నరేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కర్నూలు ఏడవ ఏడీజే న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి మంగళవారం తెలిపారు. మహమ్మద్ రఫీ 2017లో గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి యత్నించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు జిల్లా కోర్టులో మంగళవారం విచారణ పూర్తై నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్: ఈనెల 6న చైత్ర శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని వీరహనుమాన్ విజయ శోభ యాత్ర (బలోపాసన దివస్) కార్యక్రమంలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ డోన్ ప్రాంత సంయోజక్ కార్యదర్శి రామ రాజేష్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో మంగళవారం బలోపాసన దివస్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు పూజలు నిర్వహించి భక్తి పాటలతో పట్టణంలో ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చైత్ర మాస పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లెకు వెళ్లే రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు చైత్రమాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్ట పెద్దమ్మకు అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారి శాలలోని వాసవీ మాతకు ఆర్యవైశ్యులు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సమృద్ధిగా జలం

- మండు వేసవిలోనూ తగినంతగా భూగర్భ జలాలు
- వేగంగా జల్‌జీవన్ మిషన్ పనులు
- తాగునీటి ఇక్కట్లకు చెక్



అంకిరెడ్డిపల్లెలో ట్యాంకర్ నీటిని పట్టుకునేందుకు బిందెలతో బారులు తీరిన మహిళలు (ఫైల్)

కొలిమిగుండ్ల: వేసవి వచ్చిందంటే పల్లె ప్రజలు గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడేవారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పని చేయక, ప్రత్యామ్నాయ మార్గాలు లేక మంచినీటి కోసం మహిళలు పనులు మానుకొని ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి ఉండేది. 2019 తర్వాత వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఈ నాలుగేళ్లలో పరిస్థితుల్లో సమూలమైన మార్పులు చోటు చేసుకున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో ప్రజల తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరు చేరాయి. బనగానపల్లె నియోజకవర్గంలో గత మూడేళ్ల నుంచి ఎక్కడా తాగునీటి సమస్య ఏర్పడలేదు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో భూగర్భ జలమట్టం పెరిగింది. సాధారణంగా వేసవి కంటే ముందుగానే కొలిమిగుండ్ల మండలంలోని బెలుం, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, తుమ్మలపెంట, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా మారుతుండేది. మంచి నీటి సరఫరా అందించే పథకాలకు చెందిన బోర్లు పూర్తిగా ఎండిపోతుండేవి. తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నాలుగైదు నెలల పాటు నీటి సరఫరా అందించాల్సి వచ్చేది.

వేసవిలోను ఇబ్బందులు లేవు

గతంతో పోలిస్తే నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో ఎక్కడా నీటి సమస్య ఉత్పన్నం కాలేదు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు అన్నీ రీఛార్జ్ కాగా కుళాయిల నుంచి నీరు పుష్కలంగా వస్తున్నాయి. మండు వేసవిలోనూ చెరువుల్లో నీరు కనిపిస్తున్నాయి. మంచినీటి పథకాల ద్వారా కుళాయిలకు నీరు పుష్కలంగా వస్తున్నాయి. గ్రామాల్లో మోటార్లు కాలిపోవడం, పైపులైన్ లీకేజీలు మినహా ఎక్కడా భూగర్భ జలాల సమస్య కనిపించడం లేదు. అవుకు రిజర్వాయర్ నుంచి రెండు విడతల్లో నియోజవర్గంలో 30 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో మంచి నీటి పథకాల్లో సాంకేతిక సమస్య ఏర్పడితే ఈ నీటిని ఉపయోగించుకుంటున్నారు. మూడో ఫేజ్ కింద రూ.8.5 కోట్లతో కొలిమిగుండ్ల మండలంలో తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా అందించేందుకు గ్రౌండ్ లెవల్ సంప్‌ల నిర్మాణంతో పాటు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.



తుమ్మల పెంటలో కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



అవుకు రిజర్వాయర్‌కు చెందిన గ్రౌండ్ లెవల్ సంప్

చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నియోజకవర్గంలో భవిష్యత్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామాలు అవతరించినప్పటి నుంచి తాగునీటి సదుపాయం లేని చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లతో పాటు పైపులైన్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. జల్‌జీవన్ మిషన్ కింద బనగానపల్లె నియోజకవర్గానికి అత్యధికంగా రూ.65.11 కోట్లతో 209 పనులు మంజూరు కాగా 120 పనులకు పైగానే పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయితే గ్రామాలకు భవిష్యత్‌లో సైతం తాగునీటి కష్టాలు ఉండవు.

గతంలో చాలా ఇబ్బంది పడ్డాం



ఎండల కాలం రాక ముందే గతంలో నీళ్ల సమస్య వచ్చేది. కుళాయిలకు నీళ్లు రాక గనుల్లోకి వెళ్లి తెచ్చుకునే వాళ్లం. కూలీ పనులు మానుకొని నీళ్ల కోసం ఇళ్ల వద్ద ఉండేవాళ్లం. మూడేళ్ల నుంచి నీటి సమస్య లేదు. కుళాయిలకు నీళ్లు బాగా వస్తున్నాయి.

– చిన్న వర్ధమ్మ, అంకిరెడ్డిపల్లె గ్రామం

భూగర్భ జలాల సమస్య లేదు



వర్షాలు బాగా కురవడంతో ఎక్కడా భూగర్భ జలాల సమస్య లేదు. మంచి నీటి పథకాలు అన్నీ సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి. మైనర్ రిపేర్లు వచ్చినా తక్షణమే చేయిస్తున్నాం. అవుకు సీపీడబ్ల్యూస్కీం వాటర్ రెడీగా ఉంటాయి. ఇప్పటివరకు మండలంలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తలేదు.

– సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కొనసాగుతోందని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. ఆయన మంగళవారం కొలిమిగుండ్లలో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు బ్యాంకులకు వరుసగా రెండు రోజుల పాటు సెలవులు రావడంతో పంపిణీ ఆలస్యమైందన్నారు. గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని పింఛన్ సొమ్ము అందిస్తున్నారని చెప్పారు. రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని ఆయన తెలిపారు.

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ పింఛను కానుక' పథకం ద్వారా లబ్ధిదారులకు ఏప్రిల్ నెల ఫించన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మంగళవారం సాయంత్రానికి 67 శాతం మందికి పింఛన్లను అందజేశారు. కోవెలకుంట్ల మండలంలో మొత్తం 5,868 పింఛనుదారులుండగా 3,949 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా పేర్కొన్నారు. అలాగే సంజామల మండలంలో మొత్తం 5,149 మందికిగాను 60 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బనగానపల్లె: మండలంలో సోమ, మంగళవారంలో 83.09 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మండలంలో మొత్తం 12,306 పింఛన్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వలంటీర్ల ద్వారా వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు.

మహిళా కూలీలకు డిమాండ్

కొలిమిగుండ్ల: నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దాదాపు అన్ని చోట్ల పంట కోత దశకు రావడంతో మహిళా కూలీలకు డిమాండ్ ఏర్పడింది. మిర్చికి మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు త్వరగా కోతలు ముగించి దిగుబడులు మార్కెట్‌కు చేర్చి విక్రయించుకోవాలని భావిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని కోటపాడు, కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల, బిఉప్పులూరు, బితాడిపత్రి, చింతలాయిపల్లె తదితర గ్రామాలతో పాటు అవుకు మండలంలో శింగనపల్లె, సుంకేసుల, సంజామల మండలాల్లో మిరప కోత పనులు జోరుగా సాగుతున్నాయి. కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల, నందిపాడు, పెట్నికోట, గొర్విమానుపల్లె తదితర గ్రామాల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఆటోల్లో మహిళలు వందల సంఖ్యలో మిరప కోతలకు వెళుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేస్తే రూ.400 నుంచి రూ.450 మేర కూలి ఇస్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అయితే రూ.650కి పైగానే కూలి అందుతుంది. కొలిమిగుండ్ల మండలం నుంచి ఇతర మండలాలకు గతంలో కూలి పనులకు వెళ్లడం అత్యంత అరుదుగా జరిగేది. ప్రస్తుతం కూలీ రేట్లు గతంలో కంటే రూ.150 మేర పెరగడంతో పలువురు మహిళలు పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిరప కోత పనులకు ఎక్కువ మంది వెళుతున్న కారణంగా ఉపాధి పనులపై ప్రభావం పడింది.



కమ్మవారిపల్లె సమీపంలో మిరప కోత పనిలో నిమగ్నమైన మహిళా కూలీలు

గడప గడపలో సంక్షేమ కాంతులు



బేతంచెర్ల తహసీల్ పేటలో జీజీఎంపీ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, ఎంపీ పోచా

బేతంచెర్ల: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అనే భావనతో వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి హైస్కూలు ఎదురుగా డీఆర్‌డీఏ, వైకేపీ ఆధ్వర్యంలో సుమారు రూ.38 లక్షలతో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి బుగ్గన, ఎంపీ పోచా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తూ స్వయం ఉపాధి రంగాల్లో రాణించేలా మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందుబాటులో ఉంచి, వ్యాపారం పెంచుకొని కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

ప్రతి ఇంటా సంక్షేమ లబ్ధి

పట్టణంలోని తహసీల్ పేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలును లబ్ధిదారులకు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? నెల నెలా పింఛను వస్తుందా? మీ పిల్లలకు అమ్మ ఒడి, విద్యా వసతి, దీవెన, మహిళలకు వైఎస్సార్ చేయూత, ఆసరా వస్తున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంకటరెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైఎస్సార్ నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా, నాగరాజు, సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, గుమ్మగాల రాజు, వైస్ ఎంపీపీ రంగస్వామి ఎంపీటీసీలు నాగేషు, రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



సభకు హాజరైన మహిళలు

ప్యాపిలి: మహిళా సాధికారతే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద ప్యాపిలి మండలంలోని పొదుపు సంఘాలకు విడుదలైన రూ.4,86,55,000 చెక్కును మంత్రి మంగళవారం పొదుపు మహిళలకు అందజేశారు. స్థానిక లక్ష్మీ నరసింహా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి సంక్షేమ పథకాన్ని నేరుగా మహిళలకే అందజేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. డోన్ నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయన్న సంగతి అక్కచెల్లెమ్మలు గమనిస్తున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్ లక్ష్మి, నాయకులు రాజా నారాయణమూర్తి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, ఏపీఎం కృష్ణమూర్తి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక హరిబాల ట్రస్ట్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థినులకు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు, వైద్యానికి ఎల్లవేళలా తాను సహాయ సహకారాలు అందిస్తానన్నారు. రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసు, రామిరెడ్డి సేవాసమితి సభ్యులు సరోజ, సుబ్రమణ్యం, పెద్దిరెడ్డి, అభిలాష్, రాముడు, ట్రస్టు నిర్వాహకుడు అర్లప్ప పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామిరెడ్డి

6న మార్కెట్ వేలం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంత నిర్వహణ కోసం ఈ నెల 6న సాయంత్రం లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. మార్చి నెలాఖరుతో మార్కెట్ వేలం గడువు ముగియడంతో పంచాయతీ నిర్ణయించిన ప్రకారం వేలం జరుగుతుందని ఆసక్తి గల వారు పాల్గొనవచ్చన్నారు.

నేడు ఆసరా సంబరాలు

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం 3 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలో ఆసరా పథకం మూడవ విడతలో 915 గ్రామైక్య సంఘాలకు రూ.4.95 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బనగానపల్లెరూరల్: ఈ నెల 6వ తేదీన 3వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం తిరుపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బనగానపల్లెలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఆవరణలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ యర్రబోతుల వెంకటరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొంటారన్నారు. మండలంలోని 1499 పొదుపు సంఘాలకు మంజూరైన రూ.10.79 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ద్వారా సంఘాలకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

మాతాశిశు మరణాలు నివారించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: మాత, శిశు మరణాలు నివారించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. మంగళవారం స్థానిక పొదుపు భవన్‌లో పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు వారి పరిధిలోని గర్భిణి, బాలింతలకు క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. బిడ్డ ఎదుగుదలకు ఎదైనా జన్యుపరమైన లోపాలు ఉంటే ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఆయా గ్రామాల్లో నిర్వహించే ఆరోగ్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ అయ్యమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ కనక రత్నాచారి, నరసింహా, ఎంఎల్‌హెచ్‌పీలు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



డోన్ 17వ వార్డులో జీజీఎంపీ కార్యక్రమం నిర్వహిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలు అర్హులైన నిరుపేదలందరికీ చేరాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక 10వ సచివాలయం పరిధిలోని 17వ వార్డులో కౌన్సిలర్ నాగేంద్ర, దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను తెలియజేసే బ్రోచర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ.. ఏ ఒక్క లబ్ధిదారునికి కూడా ప్రభుత్వ పథకాలు అందక అన్యాయం జరగకూడదని వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేశారని, అన్ని అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందనివారు ఎవరైనా ఉంటే ఆయా సచివాలయాల్లో వెంటనే సంప్రదించాలని కోరారు. కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, సుంకన్న, పార్టీ నాయకులు డంకేష్, భాస్కర్, మహేంద్రనాయుడు, గోపాల్, దస్తగిరి, అశోక్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సంజామల(కోవెలకుంట్ల): సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి వారి గౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సంజామల మండలం గిద్దలూరు సాయి ఫంక్షన్ హాలులో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, నాయకులు బీవీ నాగార్జునరెడ్డి, పోచా శీలారెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, చిన్నబాబు, సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పోచా వెంకట్రామిరెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మండలంలోని పొదుపు మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుటుందన్న ఆలోచనతో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు కొనియాడారు.

రూ. 84.89 కోట్ల నగదు జమ

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని పొదుపు మహిళలకు మూడు విడతల్లో రూ. 84.89 కోట్ల నగదు జమ అయ్యిందని ఎమ్మెల్యే తెలిపారు. మూడవ విడతలో సంజామల మండలంలో 17 గ్రామాల్లోని 640 పొదుపు సంఘాల్లోని మహిళలకు రూ.5.43 కోట్ల నగదు మంజూరైనట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి అనేక పథకాలు వర్తింపచేస్తూ అక్కాచెల్లెమ్మల పరపతి పెంచారన్నారు. అనంతరం పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేశారు. సర్పంచ్‌లు లక్ష్మి ఉసేనమ్మ, అసద్ ఆలీఖాన్, ఎస్సీబాబు, నాయకులు బత్తుల రామచంద్రారెడ్డి, దేశాయ్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బాబు, ఏఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను మోసగించిన చంద్రబాబు

డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు మహిళలను దగా చేశాడని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. రూ.16 వేల కోట్ల రుణాలు మాఫీ చేయకుండా ఎన్నికలకు నెల రోజుల ముందు పసుపు, కుంకుమ పేరుతో రూ.10 వేలు అందజేసి చేతులు దులుపుకున్నాడన్నారు. మోసాన్ని గుర్తించిన మహిళలు 2019 ఎన్నికల్లో బాబుకు తగిన బుద్ధి చెప్పారని, రాబోయే ఎన్నికల్లో మరోసారి గుణపాఠం తప్పదని జోస్యం చెప్పారు.

వెంగళాంపల్లి చెరువుకు పర్యాటక శోభ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఉన్న చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్లు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. చెరువు వద్ద రూ. 3 కోట్లతో పర్యాటకుల వసతి కోసం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. వెంగళాంపల్లి చెరువును హంద్రీనీవా నీటితో నింపే పనులు పూర్తి కావొచ్చాయని తెలిపారు. మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఆటవిడుపు కోసం వచ్చేలా చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. చెరువు వద్ద రెస్టారెంట్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకులు బోట్ షికారు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, సర్పంచ్ రంగస్వామి, ఎంపీటీసీ రామానాయుడు, టూరిజం శాఖ ఏఈ ఈశ్వరయ్య, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్ రెడ్డి, డీఈ కిష్టన్న, జేఈ చెన్నయ్య, ఏఈ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

డోన్ టౌన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ముమ్మరంగా చేపట్టారు. డోన్ మున్సిపల్ పరిధిలో 5,439 మంది పింఛనుదారులు ఉండగా ఇప్పటివరకు 3,890 మందికి (72 శాతం) పంపిణీ చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పింఛన్‌దారులకు శుభవార్త

సచివాలయానికి 15 కిలోమీటర్ల పరిధిలో ఉంటేనే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్న నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. పింఛన్‌దారుడు పంపిణీ సమయంలో అందుబాటులో లేకపోతే అతను ఉన్న ప్రాంతానికి వెళ్లి వలంటీర్ పింఛన్ అందించవచ్చనే అంశాన్ని ప్రభుత్వం సమర్థించింది.